# కొవ్వెక్కిపోయింది

యర్రగుంట్ల వరలక్ష్మీదేవి



## "ధర్మాజీ ! సలాం"

"ఖాసిం — నమస్తే — రా — కూర్చో ఏమిటి సంగతి — ఆరోగ్యం బాగుండా ?"

"నా ఆరోగ్యానికేమిలే, బాగానే వుంది — గాని నా బేటా అక్బరుకే బాగులేదు."

"ఏం, ఏమైంది ? మొన్న నవ్వుతూ స్కూలుకు వెళ్తుంటే చూసేనే !"

"నిన్న రాత్రినుంచి కాస్త జ్వరంగా ఉంది, ధర్మాజీ ! నాకు ఆందోళనగా వుంది. ఒక్కసారి వచ్చి చూసిపోదూ."

ధర్మాజీ ఆసుపత్రి వసారా అంతా పరికించేడు. పాతిక వరకు రోగులు వేచున్నారు ప్రొద్దుటినుంచి. ఇంకా వాళ్ళని ఉండమనడం సబబు కాదు.

"ఖాసిం, నేను ఒక గంటలో వీళ్ళని పంపించేసి వస్తాను — పాపం ! ప్రొద్దున్నుంచి కూర్చున్నారు."

"సరే భాయ్, త్వరగా రా... నేను వెళ్ళి పిల్లాడి దగ్గరుంటాను. కారును నేను వెళ్ళేక పంపిస్తాను."

ధర్మాజీ నవ్వుతూ, ఖాసిం భుజంమీద ఆప్యాయంగా చేయివేసి — "వద్దులే, నా కారులోనే వస్తా. నువ్వు అక్బరు గురించి గాభరా పడకు. సీజను మారింది, అందువల్ల కాస్త జ్వరం వస్తుంటుంది. రేపే సాయంత్రం సర్కి, అక్బరు నవ్వుతూ నన్ను పలకరించేట్టు చేస్తాగా — నువ్వు వెళ్ళు."

అలా ధైర్యం చెప్పిన తరువాత ఖాసిం ముఖం విప్పారింది. అంతవరకు మేఘావృత గగనంలా ఉండేది. ధర్మాజీని త్వరగా రమ్మని చెప్పేసి ఖాసిం వెళ్ళిపోయేడు.

"డాక్టరుగారు ! నమస్కారం."

"ఏమయ్యా వెంకన్న ! మీ అమ్మ కిప్పుడెలా గుంది ?"

"జ్వరం తగ్గలేదండి — గాని మునుపున్న వాపులు తగ్గేయండి. మీరోసారి వచ్చి చూడాలి."

"సరే మధ్యాహ్నం వస్తాలే — ఏదీ నీ చెయ్యి ఎలాగుంది ?"

"బాధ తగ్గింది. కాని చెయ్యి కదపనివ్వడం లేదండి."

"అవునయ్యా -- అంతమేర కాలిందికదా, అంత త్వరగా నయమవుతుందా ? లోపలికి వెళ్ళు. కంపౌండరు ఆ కట్టు మారుస్తాడు."

"సలాం — ధర్మాజీ."

"అబ్దుల్లా — ఏం మళ్ళీ వచ్చేవు ?"

"మరేంలేదు — నా కన్ను..."

"నీ కన్నుకేం క్షేమంగా ఉంది — అంతగా అయితే కనుపించడంలేదు — అంతేగా ?"

"అంతేనండి — మరి ఏదైనా మందు."

"చూడు అబ్దుల్లా — నేను చాల బిజీగా ఉన్నాను. నా కాలం వ్యర్థం చేస్తే నీకేం వస్తుంది? నీకు మొదటే చెప్పేను. మందులేవీ పనిచెయ్యవు — ఆపరేషను చేస్తానని. నువ్వు వట్టి పిరికివాడివి. నీకు ధైర్యం కలిగేకే నా దగ్గరకు రా... ఆపరేషను చేస్తాను. చూపు మళ్ళీ కలుగుతుంది. అంతవరకు నా దగ్గరకు రాకు. పిరికివాళ్ళంటే నాకు కోపం."

"మరేం లేదండి - నాకిప్పుడు భయంలేదు గానిండి..."

"గాని — ఏమైంది అబ్దుల్లా ?"

"నా దగ్గర ఇప్పుడంత డబ్బు లేదండి."

ఆ మాటకు ధర్మాజీ రెచ్చిపోయేడు.

"ఏమయ్యా ! నీకు బుద్ధుందా — లేదా ? ఎంత డబ్బు నేను అడిగేను? ఇంతకీ డబ్బు ప్రస్తావనే వచ్చిందా ? నీకు చూపు కావాలన్నావు — నేను ఆపరేషను చేస్తానన్నాను. నీకు కలిగితే నీకు తోచినంతిస్తావు, లేకపోతే మానుకుంటావు; అంతే కాని నేను అడగని డబ్బును నువ్వు ఇవ్వవలసి వస్తుందని భయపడి కన్ను పోగొట్టుకుంటావా ? ఫో ఫో."

"క్షమించండి — ధర్మాజీ ! తెలియక ఏదో అనేసేను. రేపే వస్తానండి ఆపరేషనుకు."

"సరే, నీ ఇష్టం."

ధర్మాజీ ధర్మ కోపానికి హాలులో ఉన్న పేషంట్లు నవ్వుకున్నారు.

అబ్దుల్లా సలాం చెప్పేసి త్వరగా వెళ్ళిపోయేడు.

* * *

ధర్మాజీ అసలుపేరు కొప్పిలి ధర్మారావు. వాళ్ళ స్వగ్రామం ఆంధ్రాలోని చీరాల. వాళ్ళది పట్టు శాలీల వంశము. ధర్మారావు మేనమామకి చీరాలలో బట్టల వ్యాపారముంది. తన చిన్నతనంలో తన తండ్రి మరి కొంతమంది పట్టుశాలీలతో కలిసి మహారాష్ట్రలోని బివండీ అన్నఊరుకి వలస వచ్చేసేడు. బివండీలో సుమారు పది పదిహేనువేల మంది ఆంధ్రులున్నారు. చాలా మట్టుకు నూలు వడకడం, బట్టలు నేయడం వంటి టెక్స్టైలు పరిశ్రమలలోనే వాళ్ళంతా పనిచేస్తున్నారు. ప్రసిద్ధి కెక్కిన ఆంధ్రుల పట్టుశాలీల నేర్పు, కౌశల్యం ఈ పరిశ్రమలలో ఉపయోగపడుతున్నాయి. అందుకే అక్కడున్న మహారాష్ట్రులకు ఈ ఆంధ్ర పారి శ్రామికులంటే మంచి గౌరవం. మరి కొంతమంది ఆంధ్రులు అక్కడ వివిధ వ్యాపారములు చేస్తున్నారు. ధర్మారావు తన మేనమామ దగ్గర పెరిగి పెద్ద వాడై ఆంధ్రాలోనే డాక్టరు పట్టా ఓ చేత్తో పుచ్చుకుని, మరో చేత్తో మేనమామ కూతుర్ని చేపట్టి, తన తల్లిదండ్రులున్న బివండీ వచ్చేసేడు, పాతికేళ్ళ క్రితం.

# ఊరు చచ్చిపోయింది

బివండీలో ఉన్న జనాభాలో ముసల్మాన్లు, హిందువులు సరిసమంగా ఉన్నారు. హిందువులలో సగ భాగం ఆంధ్రులున్నారు. ఆంధ్ర సంస్కృతికి, సంఘానికి గౌరవాధ్యక్షుడు, డాక్టరు ధర్మారావు. ధర్మారావు ఈ పాతికేళ్ళ ప్రాక్టీసులో చాలా పేరు ప్రతిష్ఠలతో, ధనం ఆర్జించేడు. బివండీలోనేగాక ఈ చుట్టుప్రక్కల ఉన్న గ్రామాలలో కూడా మంచి డాక్టరని, చల్లని చేయని పేరు తెచ్చుకున్నాడు. ధర్మారావు పేరు, మెల్లగా ధర్మారావుజీ, అది క్రమేణా ధర్మాజీగా మారిపోయింది. ఆఖరుకి ఆ పేరే స్థిరమైపోయింది.

ధర్మాజీ ఎప్పుడూ నోరు తెరిచి ఏ పేషంటుని డబ్బు అడగడు. వాళ్ళెంత యిస్తే అంత పుచ్చుకుంటాడు. ఇవ్వకపోయినా ఏమి అనుకోడు. ఇంకా బీదవాళ్ళయితే తన డబ్బుపెట్టి మందులు కొని ఇస్తాడు. వివిధ మందుల కంపెనీల నుంచి వాళ్ళ ఏజెంట్ల వల్ల చాలా మందులు డాక్టర్లకు వస్తుంటాయి. చాలామంది డాక్టర్లు చేసినట్లు ఆ మందులు అమ్మకోడు. బీద రోగులకు ఇచ్చేస్తాడు. అందుకే అతడు పేరుకి తగినట్లు ధర్మప్రభువని అందరూ గౌరవిస్తారు. ఇప్పుడు ధర్మారావుకి యాభై ఏండ్ల మహాలక్ష్మివంటి భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్ళ అతని సంసారం. అన్ని విధాల సంతృప్తి కలిగివున్న ధర్మాజీకి ఈమధ్య చిన్న అశాంతి కలుగుతూంది. ముసల్మానులు, హిందువులు ఆ బివండీలో తరాలవారిగా ఎంతో సభ్యతతో జీవిస్తున్నారు. దేశంలో ఏ మూలో మత కలహాలు కలిగినప్పటికి వాళ్ళేమి చలించకుండా చాలా బాంధవ్యంతో కలిసిమెలిసి బ్రతుకుతున్నారు. కాని గత నెల్లాళ్ళగా ఈ పారిశ్రామిక నాయకులు రెండు మతాలకీ యిద్దరు తయారై చిన్న చిన్న కలహాలు కల్గిస్తున్నారు.

ఆ ఊరులో చాలామందికి ధర్మాజీ అంటే చాలా గౌరవం. అలా అని ధర్మాజీ అంటే యిష్టం లేనివాళ్ళు లేకపోలేదు. అలాగే ఖాసిం ఆలీ అంటే ముసల్మానులకు చాలా భక్తి, అభిమానం. అతడు వాళ్ళకి మౌల్వికూడా. ఖాసింకు పరువు, ప్రతిష్ఠ, ఆర్థికబలం చాలా ఉంది. కానీ చాలా కాలం వరకు పిల్లలు కలుగలేదు. అదే అతనికి చింతగా ఉండేది. కానీ అతడు ఏకపత్నీవ్రతుడు. అతడు ముసల్మాను అయినప్పటికి బహు భార్యత్వంమీద ఆయనకు గౌరవం లేదు. అలా నమ్మకంతో ఉన్న ఖాసింకు 'అల్లా' అన్యాయం చేయలేదు. ఖాసింకు వివాహమైన ఇరవై సంవత్సరములకు చందమామ లాంటి చక్కని కొడుకు పుట్టేడు. ఆ కొడుక్కి అక్బర్ ఆలీ అని పేరు పెట్టుకున్నాడు. ఖాసింకు అక్బర్ పాదుషా అంటే ఎంతో పూజ్య భావం. అన్ని మతాలని సమదృష్టితో చూచిన అక్బరు పాదుషా సిసలైన ముసల్మానుగానీ, పర మతాలను సంకుచిత దృష్టితో చూచిన ఔరంగజేబు, ఎన్ని ప్రార్థనలు సల్పినా, తన టోపీలను తనే కుట్టుకున్నా, అసలైన ముసల్మాను కాడని అతని నమ్మకం. అందుకే ఏ మతం వాడైనా, మానవత్వం కల్గినవాడైతే తన సోదరుడితో సమానమని అతడు భావించేవాడు.

మౌల్వి ఖాసింకు డాక్టరు ధర్మాజీతో పదిహేను ఏళ్ళ క్రితం పరిచయం అయింది. ఆనాటినుండి ఈనాటివరకు ఆ స్నేహం దిన దిన వృద్ధి పొంది, రక్తాన్ని పంచుకున్న యిద్దరు సోదరుల కున్నంత బాంధవ్యంగా మారింది. వాళ్ళ స్నేహాన్ని చూసి అసూయ చెందినవాళ్ళు లేకపోలేదు. ధర్మాజీకి ఖాసిం కొడుకు అక్బర్ అంటే చాలా ప్రేమ. తన పిల్లలు పెద్దవాళ్ళయిపోయేరు. అందుకే చిన్నపిల్లవాడైన ఆ అక్బర్‌తో ఆడుకుండేవాడు. ఎన్నో బొమ్మలు, పండ్లు, బిస్కట్లు కొని యిచ్చేవాడు. డాక్టరు ధర్మాజీ రాగానే ఖాసిం ఇంట్లోవాళ్ళు 'అదుగో మీ బాబాయ్ వచ్చేరు', అని చెప్పేవారు. అక్బరు కూడా 'బాబాయ్' అని చనువుగా మెసలేవాడు. అలా ఉండేది వాళ్ళ బాంధవ్యం. ఈ కథనాటికి అక్బర్ ఏడేండ్లవాడు. మరి తల్లిదండ్రులకు రెండో ప్రాణంగా ఉండేవాడు.

## ఉగాది పాట

ఉగాది వచ్చింది చెలీ !
ఒక్క పాటపాడు
ఉజ్వలమైన శోభలు
ఉర్వి నిండినవి చూడు

శిశిర తాపానికి గురైన
చెట్లవైపు చూడు
కిసలయోత్కారాలతో
హసిస్తున్నవి నేడు

నిన్నటి శిశిర తాపాన్ని మరచి
నేడు చిరునవ్వే వనాల్లా
మానవాళి కంటకాల్ని గడచి
మధుమాసంలో ప్రవేశించాలి

మాలిన్యాలు శిశిర పత్రాల్లా
రాలిపోయినవి నిన్న
అవనికి ఆనందం పంచగా
ఆగమించింది వసంతం నేడు

ఏదీ ఉగాది పచ్చడి పాత్ర
ఈ పెదవికందించు చెలీ !
ఒగరు తీపి చేదుల్లోనే
ఉంది జీవిత మాధుర్యం సఖీ !

ఉగాది వచ్చింది చెలీ !
ఒక్క పాటపాడు !

— తిరునగరి

* * *

ధర్మాజీ ఆ సాయంత్రము ఆంధ్రా క్లబ్బులో కూర్చున్నాడు. ప్రక్కన మరో కుర్చీలో గోపాలరావు కూర్చున్నాడు. గోపాలరావు కార్మికుడు. కార్మికులలో మంచి పలుకుబడి ఉన్నవాడు.

''చూసేరా ! ధర్మాజీ ! మరో పదిహేను రోజులలో శివాజీ జయంతోత్సవాలు జరపాలను కుంటున్నారా మహారాష్ట్రులు. కానీ ఈ ఊరిలో మాత్రము ఆ ఉత్సవము విజయవంతమవుతుం దనుకోను.''

''ఏం — ఏమిటా ఆటంకం ?''

''మరేంలేదు — ఈ పురజనులు ఉత్సవ ఊరేగింపును మేళతాళాలతో మెయిన్‌రోడ్డు మీదుగా బజారు వీధిగుండా కోనేటి గట్టున ఉన్న శివాలయము వరకు తీసుకొనివెళ్ళి తిరిగి, ఖార్జానావీధిలోంచి, పెద్ద మసీదు ప్రక్కనున్న చిన్న బజారులోంచి పెద్ద వీధిలోకి తీసుకొని వద్దామని అనుకున్నారు. ఎందుకేనా మంచిదని ముస్లిం పెద్దలకి తను ఊరేగింపును గురించి చెప్పేరు. ఆ పెద్దల్లో కొందరు చిన్నవాళ్ళ లీడర్లుచేరేరు. వాళ్ళు ససేమిరా అలా తీసుకొని వెళ్ళడానికి వీల్లేదన్నారు. వాళ్ళు చాల నిబంధనలు పెట్టేరు. మసీదు ప్రక్కనుంచి వెళ్ళడానికి వీల్లేదన్నారు మసీదు దగ్గరలోనున్న చిన్నవీధి గుండా వెళ్ళినప్పటికి మేళతాళాలు పనికి రావన్నారు. వాళ్ళ సాయంకాల ప్రార్థనలకి ఆటంకంగా ఉంటుందట. ఇంకా వీధుల్లోంచి వెళ్ళే టప్పుడు ఎటువంటి నినాదాలు చేయకూడదట. ఇంకా ఏ విధంగా కూడ ముసల్మానులకు కోపంగాని, నష్టంకాని కల్గించకూడదట. దాంతో మన వాళ్ళంతా, అంటే హిందువులంతా చాలా కోపం తెచ్చుకున్నారు. 'ఇదేం పాకిస్థాననుకున్నారా ? మీరు చెప్పినట్లు మేము చచ్చినట్లు పడి ఉండడానికి. ఇది హిందూస్థాన్. మా ఇష్టమొచ్చినట్లు మేము ఊరేగిస్తాం, మా ఇష్టమొచ్చినట్లు పాడతాం, ఆడతాం, బాజా భజంత్రీలు వాయిస్తాం. అన్నిటికి అడ్డు చెప్పడానికి మీరెవరు ?' — దాంతో మాటా మాటా కాస్త పెరిగింది. ఇంతలో మౌల్వి ఖాసిం వచ్చి ఇరుపక్షాలని చీవాట్లుపెట్టి, అన్నదమ్ములైన హిందు, ముస్లిములు శాంతించేక మాట్లాడు కుందామని సభని చాలించేసేరు. ధర్మాజీ ! ఖాసిం భాయి రాబట్టిగాని లేకపోతే ఘర్షణ తీవ్రంగా పోయేదే. ఎందుకో నాకు కాస్త భయంగానే ఉంది. ఇంతకీ మీ ఉద్దేశమేమిటి యిందులో.''

ధర్మాజీ ముఖం విచారంతో వాడిపోయింది.

''చూడు గోపాల్ ! ఒక గ్లాసునిండా విష ముందనుకో. అందులో ఎన్ని పాలచుక్కలు వేసి నప్పటికి, అవి పాలుగా మారవు — గాని ఒక గ్లాసు నిండా పాలున్నాయనుకో, ఒక్క విషపు చుక్కచాలు, ఆ పాలన్నిటిని విషముగా మార్చేయవచ్చు. అలాగే మంచి — చెడు. ఇన్నాళ్ళు ఏ అశాంతి లేకుండా, హిందువులు, ముసల్మానులు జీవిస్తున్నారా ఇక్కడ— గాని ఒక్క చుక్క విషం చాలు ఇంత బాంధవ్యాన్ని తునాతునకలు చేయడానికి. అందుకే ఆ బాంధవ్యాన్ని చెడకుండా చేయడానికి అందరం ప్రయత్నించాలి. అందరిమీద ఆ బాధ్యత ఉంది. అందుకే ఈ ఘర్షణకి కారణం హిందువులదా, ముసల్మానులదా అన్న ప్రశ్న అనవసరం, అవివేకం. పెట్రోలుమీద నిప్పువేసినా, నిప్పుమీద పెట్రోలు పోసినా ఫలితం ఒక్కటే. అందుచేత ఈ పరిస్థితి చేయిజారి పోకుండా చూడడం ఎంతైనా అవుసరం. మనం హిందువులం. ఈ భారతదేశంలో మనం అధికులం అన్న అహంభావం మనకుండ గూడదు. గోపాల్ ! ముఖ్యంగా మన తెలుగువాళ్ళకి చెప్పు — అనవసరంగా ఆవేశపడొద్దను. మనం ఇక్కడకు వలస వచ్చిన

వాళ్ళం. పరిస్థితులు విషమిస్తే ఎక్కువగా బాధ పడేది మన తెలుగువాళ్ళే. ఈ సంగతి మనవాళ్ళను మరచిపోవద్దను. నేను రేపు ఖాసిం భాయ్‌తో మాట్లాడుతాను — మీరు మరేం గాభరా పడకండి.''

*　　　*　　　*

ఖాసిం ఇంట్లో నలుగురు పెద్దలు, పిన్నల్లో లీడర్లు చేరేరు, ఒకనాటి సాయంకాలం.

''ఖాసింజీ — చూసేరా ఈ హిందువుల ఆగడం. మనం మైనార్టీలం — అందుకే వాళ్ళ అడుగులకు మడుగులొత్తాలిట. వాళ్ళు కావాలనే మన పెద్ద మసీదు ప్రక్కనుంచి ఊరేగిస్తామంటున్నారు, బాజాభజంత్రీలతో. ఇంతకీ నినాదాలు మానరట. నేను రహస్యంగా కనుక్కున్నాను, వాళ్ళ నినాదాలేమిటో. శివాజీకి పరమ శత్రువులు ముస్లిములు — అందుకే ఔరంగజేబుకు బద్ధ వైరుడై శివాజీ మహారాష్ట్రము నుంచి ముస్లిములను తరిమివేశాడుట. అలాగే ఇప్పుడున్న ముస్లిములను ఈ దేశం నుంచి పాకిస్థానుకు ఈనాటి పౌరులు తరిమివేయాలట — ఇవి వాళ్ళ నినాదాలు. ఇన్నాళ్ళ మన మైత్రిని మరచిపోయేరు. ఇప్పుడు మనం శత్రువులుగా వాళ్ళకి కనిపిస్తున్నాం. అందుకే వాళ్ళు ఊరేగింపులో ఇటువంటి నినాదాలు చేయడానికి మేమెవ్వరం ఒప్పుకోం. వాళ్ళుగాని అటువంటి కేకలు వేసేరంటే మేం ఊరుకునేది లేదు. మసీదు ప్రక్కన బాజా భజంత్రీలు వాయించేరంటే, వాటితోపాటు వాళ్ళను మూగవోయినట్లు చేసేస్తాం. ఖాసింజీ! వాళ్ళు ఈ శివాజీ జయంతి ఉత్సవాల నెపంతో మనపైన దౌర్జన్యం చేయాలనుకుంటున్నారు. మనం ఊరుకుంటే మనకే నష్టం.''

''చూడు హాజీషకూర్! నువ్వు చాల ఆవేశంతో మాట్లాడుతున్నావు. నువ్వు ఎప్పుడైనా మన హిందు భాయిల గురించి ఇలా మాట్లాడేవా? ఇప్పుడెందుకిలా మాట్లాడుతున్నావు? ఇంతకీ వాళ్ళు ముస్లిములకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తారని నీకెవ్వరు చెప్పేరు? ఇందులో ఏదో మోసముంది. మనల్ని హిందువులనుండి వేరు చేయడానికి ఎవరో పన్నిన కుట్ర ఇది. మీరు చెప్పుడు మాటలు విని మోసపోకండి. ఇన్నాళ్ళున్న మన మైత్రిని వమ్ము చేయకండి. అనుమానం దుఃఖానికి దారి చూపుతుంది. చేతులు కాలేక ఆకులు పట్టుకుంటే ప్రయోజనముండదు. అందుకే ఆవేశపడకుండా నా మాట వినండి. నేను ధర్మాజీతో, మిగతా హిందువుల పెద్దలతో మాట్లాడుతాను. మన పెద్ద మసీదువద్ద బాజాభజంత్రీలు మ్రోగించవద్దని వేడుకుంటాను. ఏ నినాదాలు చేసినా మన మైత్రికి భిన్నంగా చేయవద్దని చెప్తాను. నామీద మీకేమాత్రం గౌరవాభిమానమున్నా మీరిలా ఆవేశపడవద్దు. శాంతిగా ఉండండి. చెప్పుడు మాటలు వినకండి. అనవసరంగా లేని దుఃఖాన్ని కోరుకోకండి. రేపు నేను అన్న ధర్మాజీని కలుస్తాను. ఇక వెళ్ళండి'' అని మౌల్వి ఖాసిం హితబోధ చేసి పంపేసేడు గానీ, మెల్లగా మనస్సులో భయం, విచారం గూడు కట్టుకున్నాయి.

*　　　*　　　*

''ఏం భాయ్ ధర్మాజీ! ఏమిటి అనవసరంగా గొడవలు వస్తున్నాయే.''

## ఉగాదీ!

సోదరీ! ఉగాదీ! స్వాగతం! సుస్వాగతం!

ఆంధ్రజాతికి అరవై మంది
ఆడపడుచులు మీరు
ఎన్నడూ పుట్టింటికి ఏకంగా రారు!
ఏడాది కొక్కరే ఎంచుకొని వస్తారు!
పెట్టుపోతలాశించి కాదు — మరేమీ
పట్టుకు పోటానికి కాదు!
సంతుభిత సోదర గణానికి
సంతోషం పంచిపెట్టటానికి!
భావిపై కొత్త ఆశలు
పల్లవింప జేయటానికి!

అంతేకాదు — మీ
అందరికీ ఆతిథ్య మిచ్చి
షష్ఠిపూర్తి చేసుకోగల
అదృష్టవంతులే అరుదు!
అటువంటప్పుడు —
ఉన్నా లేకపోయినా!
తిన్నా తినకపోయినా!
జీవితంలో వచ్చినన్ని ఉగాదులనైనా
ముదముతో ఆహ్వానించలేనివాడు
ముమ్మాటికీ దురదృష్టవంతుడు!

అందుకే సోదరీ! ఉగాదీ! స్వాగతం!!
నీకు హార్దిక స్వాగతం!!

**— ఆర్. కె. కటారి**

''చూడు ఖాసిం! భగవంతుడిమీద భారం వేసి మన ప్రయత్నం మనం చేద్దాం. నిప్పు రాజుకోకుండా సర్వవిధాల చూద్దాం.''

''నేను మావాళ్ళకి చెప్పేను. వచ్చే చిక్కేమిటంటే రెండువైపులా రెండు దుష్టశక్తులు చేరేయి. హిందువులు ఏదో చేస్తారని వాళ్ళు భయపడి క్రోధాన్ని తెచ్చుకోడం, ముస్లిములు ఏదో రభస చేస్తారని అనుమానపడి వీళ్ళు బందోబస్తు చేస్తుండడం ఏమి బాగులేదు.''

''అవును. ఈ అనుమానాలే, ఈ భయాలే ఏదో ప్రమాదానికి దారితియ్యొచ్చు. ఇందులోని చిత్రం ఏమంటే నా మాటంటే ఎంతో గౌరవంగా పరిగణించే వ్యక్తులే నా హితబోధలకి లెక్కచెయ్యటంలేదు. ఏవో దుష్టశక్తులు వాళ్ళని రెచ్చగొడ్తున్నాయి. అదే నాకు అంతుచిక్కటంలేదు. నువ్వు మీవాళ్ళకి బాగా నచ్చచెప్పు — ఆవేశపడవద్దని.''

''మొన్నను నేను చేసిందల్లా అదే — గానీ నా భయం ఏమిటంటే మావాళ్ళంతా చేయిజారిపోతున్నారనే. ఏవేవో నాళ్ళలో వాళ్ళు కూడ బలుక్కుంటున్నారు. ఏవో ప్లాన్లు వేస్తున్నారు. నన్నో ముసలివాడుగా, ఈ ప్రపంచం పోకడల్ని తెలియనివాడ్నిగా అనుకుంటున్నారు వాళ్ళు — గాని ఒకటి తెలియకుండా ఉంది, ఈ యువతరానికి. పొరుగువాడింటికి నిప్పంటిస్తే, ఆ మంటల్లో తమ యిల్లూ కాలి నుసి అయిపోతుందని.''

''పరిస్థితులు విషమించకుండ మనిద్దరం రేపు ఓసారి కలెక్టరుగార్ని కలసి, ఎందుకేనా మంచిది, పోలీసు బందోబస్తు ఈ ఊరేగింపు రోజున ఎక్కువగా చేయాలని చెప్పివద్దాం — ఏం ఖాసిం భాయ్?''

''సరే, అలాగే చేద్దాం — మనవాళ్ళెవరు మన మాటలు వినేటట్లులేదు.''

*　　　*　　　*

మరో వారంరోజులకి సాయంత్రం ఆరుగంటల సమయం — ఎక్కడ చూచినా హాహా కారాలు, మిన్నుముట్టే మంటలే. పీకలు తెగిపోతున్నాయి. రక్తం కాలువలై పారుతోంది. మూఢనమ్మకాలకి, మతం పేరిట అవివేకమైన పట్టుదలలకి, ఆవేశాలకి బానిసలై మనుష్యులు రాక్షసులైపోయేరు. పవిత్రములైన పెద్ద మసీదు, శివాలయం గోడల నుంచి కారే రక్తధారలకి మరకలై అపవిత్రమౌతున్నాయి. గాంధిజీ చనిపోవడమే మంచిదైంది. లేకపోతే ఆయనే ఆత్మహత్య చేసుకునేవాడు ఈ రక్తస్నానాన్ని చూడలేక.

ఏనాటి నుండో దాగివున్న ఉక్రోషాలకి, ఉన్మాదాలకి మతం పేరిట దారిచూపుతున్నారు. మనుష్యులు చేస్తున్న ఈ పిశాచ నృత్యానికి అమాయకులు, వారితోపాటు అహంకారులు బలైపోతున్నారు. పరిస్థితులు చేయి జారిపోయేయి. గౌరవనీయులు, పూజ్యులైన ధర్మాజీ, ఖాసిం వంటి పెద్దలు చేసేదిలేక అశక్తులై ఇల్లు విడిచిపోలేక బయట జరుగుతున్న రాక్షసకృత్యాన్ని అరికట్టలేక, చూసి సహించలేక మతోన్మాదుల ఆవేశానికి బలైపోతున్న అమాయకుల ఆత్మలకి తర్పణంగ కన్నీరు కారుస్తు కూర్చున్నారు.

ఈ గొడవల్లో ఖాసింకు హృదయం పిండే మరో పరిస్థితి ఏర్పడింది. తనకు ప్రాణ సమానమైన కొడుకు అక్బరుకు జ్వరం ఎక్కువైంది. ఆ రాత్రి కాస్త పలవరింతలు కూడ మొదలైనాయి. ఏ డాక్టర్ని పిలిచినా ఎవ్వరు బయటకు రాలేరు, ప్రాణంమీద ఆశ వుంటే. ఈలోగా వాల కొంపలకి నిప్పంటించేసేరు, దుండగులు. ఇట్లాంటి విషమ పరిస్థితుల్లో పిచ్చివాడై ఖాసిం, అతడి భార్య జహనారా బేగం కొడుకు మంచం ప్రక్కన కూర్చున్నారు, పచ్చి మంచినీళ్ళయినా పుచ్చుకోకుండా.

మరునాటికి పరిస్థితులు కాస్త చల్లబడితే మెల్లగా తను ధర్మాజీ ఇంటికి వెళ్ళి ధర్మాజీని పిలచి తెద్దామనుకున్నాడు, లేదా అల్లా దయవల్ల పిల్లాడికి నిమ్మళిస్తే రెండురోజులాగవచ్చు.

కాని ఆ మరునాడు పోరాటాలు మరీ ఉధృతంగా జరుగుతున్నాయి. దండులుగా వెళ్ళి కొంపలు కాల్చేస్తున్నారు. దుకాణాల్ని, ఇళ్ళని దుండగులు లూటీ చేస్తున్నారు. తరువాత ఇళ్ళకు నిప్పంటించి ఆ కాలే ఇండ్లలో ఆ ఇంటివాళ్ళను ఆడ, మగ, పిల్లలు, పెద్దలు అన్న విచక్షణలేక పడేసి కాల్చేస్తున్నారు.

కారే రక్తానికి భూదేవి ముఖం సిగ్గుతో అరుణ వర్ణమైంది. రగిలే మంటపొగలకి ఆకాశం విషపూరితమై, నల్లనైంది. ఆ రోజంతా అక్బరుకి ఒంటిమీద తెలివిలేదు. కాస్త చీకటి పడుతుందనగా

పిల్లాడికి ఊపిరి సల్పడం బాధకరంగా ఉంది. ఎగ ఊపిరి మొదలైంది. ఖాసింకు పరిస్థితి అర్థమైంది. ఇంకా ఆలస్యం చేస్తే పిల్లాడు దక్కడు.

మెల్లగా మేడదిగి తన వేషాన్ని మార్చేసేడు. లుంగీ తీసి తెల్లని పంచె కట్టుకున్నాడు. దానిపైన వదులుగానున్న లాల్చీ తొడుక్కున్నాడు. పైమీద జలతారున్న శాలువ వేసుకున్నాడు. తన అనుచరుల్ని నలుగుర్ని వెంటబెట్టుకున్నాడు — ఆ నలుగురు ముష్కరులే. ఒక్కొక్కరి దగ్గర పదునైన కత్తులున్నాయి. వాళ్ళకి పరిస్థితులు విడమర్చి చెప్పి ఎలాగైనా డాక్టరు ధర్మాజీని తేవాలని చెప్పేడు. వాళ్ళను తనకు సంరక్షకులుగా చేసుకుని ఆ చిరు చీకటిలో ఆ ముసల్మాను పడానుంచి బయలుదేరేడు.

పెద్దవీధి వచ్చింది. పెద్దవీధిలో నుంచి నూరు గజాలు పోతే ధర్మాజీ ఇల్లు వస్తుంది. కత్తులు పట్టుకున్న అతని అనుచరులు పెద్దవీధి కొస్తే వారి తలలెగిరిపోవచ్చు. అందుకే ఆ వీధి మలుపులో దాగి ఉండమని చెప్పి ఖాసిం శాలువ ఒంటిమీద కప్పుకుని పెద్దవీధిలోకి ప్రవేశించేడు. కొంతదూరం పోయేక ఓకరౌడీ తారసపడి కత్తి ఎత్తి "ఎవరు నువ్వు" అని ప్రశ్నించేడు.

"నేనయ్యా మురారిలాల్‌ని — మా పిల్లాడికి బాగులేకపోతే మందుకోసం డాక్టరు ధర్మాజీ ఇంటికి పోతున్నా. నీ కోపం ఆ పాడు తురకల మీద చూపించు. నా మీదెందుకు. నన్ను వెళ్ళనీయవయ్యా."

"పో! త్వరగా పో! తురకలి దండుగాని ఇటుగా వస్తే నిన్ను చంపేస్తారు," అని హెచ్చరించి వదలిపెట్టేడు. ఇతడు పలకరించి వదిలేయడం చూసి ఆ పెద్ద వీధిలో తిరుగుతున్న మిగతా రాక్షసులు మరేమీ అనలేదు; మన హిందువే కదా అని ఊరుకున్నారు.

గబగబా ధర్మాజీ ఇల్లు చేరి గట్టిగా పిలచేడు ఖాసిం. పరిగెత్తుకుంటూ వచ్చి ధర్మాజీ తలుపు తీసేడు. ఖాసిం వెంటనే తన కొడుకు విషమ పరిస్థితిని చెప్పేడు. అన్నీ విన్న ధర్మాజీ అదిరిపోయేడు. "ఆ కేసు డిఫ్తీరియా. వెంటనే వైద్యము చేయకపోతే ఊపిరి సలపక పిల్లవాడు చనిపోవచ్చు. పద. మందుల బ్యాగు, ఆపరేషను పరికరాలు తెస్తా,"నని లోనికి వెళ్ళేడు.

ఇంతలో ధర్మాజీ బయటకు వెళ్తున్నాడని

**చిరునామాలు : మనవి**

పత్రికలో పడ్డ రచయితల చిరునామాలు కావాలని వ్రాయవద్దని మనవి. మీరు వారికి వ్రాసే ఉత్తరాలు కేరాఫ్ ఎడిటర్, ఆంధ్ర సచిత్ర వారపత్రిక, గాంధీనగరం అని వ్రాసి నట్లయితే — మా కార్యాలయం వాటిని "రీ డైరెక్టు" చేయడానికి ప్రయత్నిస్తుంది. కనుక రిప్లయి కార్డులు వ్రాయవద్దని మనవి.

— సం॥

## ఊరు చచ్చిపోయింది

తెల్పి భార్యా పిల్లలు వెళ్ళొద్దని ఎంతో బ్రతిమాలేరు.

"అక్బరు నా కొడుకుతో సమానమే. రక్తం పంచుకోకపోయినా, ఖాసిం నా తమ్ముడే. అక్బరు ప్రాణంతో మరో రెండు ప్రాణాలు ముడిపడి ఉన్నాయి. నా ప్రాణం పోతేపోనీ, నా విధి నిర్వహణలో. మీరంతా పెద్దై ప్రయోజకులయ్యేరు, నాకేమి చింతలేదు. ఇంతకీ ఖాసిం నా ప్రక్కనుంటే ఆ ముసల్మాను పడాలో నాకేమి భయం లేదు. నేను గంటలో వచ్చేస్తాను," అని ధైర్యం చెప్పి ఖాసింతో బయటకు వచ్చేడు.

డాక్టరు ధర్మాజీకి తెలియనివారు లేరుగనుక, ధైర్యంగా ఖాసింతో పెద్ద వీధి దాటి ముసల్మాను పడాలోకి వచ్చేడు. వెంటనే ఆ నలుగురు తురక ముష్కరులు వాళ్ళిద్దరికి సంరక్షకులుగా ఏర్పడ్డారు. అప్పటికే చీకటి పడింది. త్వరగా వెళ్తున్నారు ఖాసిం ఇంటివైపుకి.

పది నిముషముల తరువాత హఠాత్తుగా ఒకడు ధర్మాజీ ముఖంమీద టార్చి వేసి 'ఆగు' అని కేక పెట్టేడు, మరో చేత్తో కత్తి ఎత్తి. ధర్మాజీ ఆశ్చర్యపోయి ఆగిపోయేడు. వెంటనే వెనుకనున్న ఒక సహచరుడు ఆ కత్తి పట్టుకున్న చేయి పట్టుకుని,

"అబ్దుల్లా ఆగు! ఎవరనుకుంటున్నావు. మన డాక్టరుభాయి ధర్మాజీ!"

"అతడు హిందువుడేనా మరి?"

ధర్మాజీ అబ్దుల్లా కంఠాన్ని పోల్చేడు.

"అబ్దుల్లా! నీకు కన్ను ఆపరేషను చేసి దృష్టినిచ్చింది, ఆ దృష్టితోనే నన్ను పోల్చుకొని చంపడానికా? బాగుంది. నీకూ ఉన్మాదావస్థ బాగా పట్టిందే," అన్నాడు సౌమ్యంగా.

అప్పటికి అబ్దుల్లాకి కమ్మిన పొరలు విచ్చిపోయాయి. సిగ్గుపడిపోయాడు..

"క్షమించు ధర్మాజీ," అని తప్పుకున్నాడు.

మరో ఐదు నిముషములు గడిచేయి. మరో నూరు గజాల దూరంలో ఖాసిం ఇల్లుంది. ఆ మలుపులో ఒక వీది లైటుంది. ఆ వెలుతురు ధర్మాజీమీద పడింది. ఆ మలుపుకు ఎదురుగానున్న ఇంట్లో కిటికీ దగ్గర కూర్చుని ఒక ముష్కరుడు కత్తి నూరుతున్నాడు. అప్పటికే వాడు ప్రొద్దున్నించి ఓ పన్నెండుమందిని చంపేడు. కత్తి మొద్దుబారిందని రాయిమీద నూరుతున్నాడు. అతని భార్య పిల్లలకి తిండి పెడుతోంది. అడుగుల చప్పుడు విని తలెత్తేడు. వీధి లైటు వెలుతురులో ధర్మాజీ అగుపించేడు. ఇంత గొప్ప వ్యక్తిని చంపితే ఘనంగా ఉంటుందని రివ్వున బాణంలా వచ్చి ధర్మాజీ వీపులో ఆ పెద్ద కత్తిని గుచ్చేసాడు.

అదే క్షణంలో వెనుకనున్న ఖాసిం అనుచరుడు ప్రమాదాన్ని గుర్తించి, చటుక్కున తన కత్తిని ఎత్తి ఒకేవేటుతో ఆ దుండగీడు తలని నేలగూల్చేడు. కానీ సమయం మించిపోయింద. ధర్మాజీ వీపులో ఆ పిచ్చివాడి కత్తి అదే క్షణంలో గుచ్చుకుంది. ధర్మాజీ నేలగూలేడు.

ఖాసిం, అతని అనుచరులు నిర్విణ్ణులయ్యేరు. ఎంతలో రెప్పపాటు కాలంలో అనుకోని ప్రమాదం

**?**

మృత్యు ముద్ర వుంది,
కాబట్టి — జీవితం మిథ్య.
వాసనాఛాయ వుంది
కనుక — ప్రేమ మిథ్య.
అసహన రేఖ వుంది
కాబట్టి — సఖ్యత మిథ్య.
మిథ్యాభావముంది
మరి — మిథ్యకూడ... ?

— విద్యారణ్య కామ్లేకర్

జరిగిపోయింది. మెల్లగా ఖాసిం చెయ్యి పట్టుకొని ధర్మాజీ నించున్నాడు. వీపులో కత్తి తీయవద్దన్నాడు. తనని పట్టుకొని త్వరగ ఖాసిం కొడుకు దగ్గరకు తీసుకొని వెళ్ళమన్నాడు. ఆలస్యం చేయవద్దన్నాడు.

ఖాసిం కొడుకుని పరీక్షించేడు. అప్పటికే ఆ పిల్లాడి ఊపిరి స్వల్పంగా వస్తోంది. వెంటనే మెడమీద గంటుపెట్టి రబ్బరు ట్యూబు ఊపిరి తిత్తులకు పెడ్తేగాని ప్రయోజనం లేదని బ్యాగ్ తెరిచేడు.

ధర్మాజీ షర్టు అంతా రక్తంతో తడిసి పోయింది. ధర్మాజీ ధర్మనిష్టకు, కర్తవ్య నిర్వహణ దీక్షకు ఖాసిం, అతని భార్య, అనుచరులు కంపించి పోయారు. అలాగే వాళ్ళు రోదిస్తున్నారు. ధర్మాజీ త్వరగా బ్యాగ్ తెరిచి చిన్నకత్తిని తీసుకున్నాడు. ఆపరేషను చేసి పిల్లడ్ని బ్రతికించి, ఆ చిన్నారి ప్రాణంతోపాటు ఆ తల్లిదండ్రుల ప్రాణాల్ని కాపాడుదామని చేయి ఎత్తేడు. ఆ క్షణంలో ధర్మాజీ ప్రాణం పోయింది. కుప్పలా మంచం ప్రక్కన కూలిపోయేడు. మరో మూడు నిముషాలకి అక్బరు ప్రాణం పోయింది.

ఆ రెండు చావులు చూసేక ఖాసిం ఒకే కేక పెట్టేడు. "అల్లా ఈ రాక్షసులని క్షమించడు. ధర్మమూర్తి అయిన నా అన్న ధర్మాజీని చంపి, అందుమూలంగా నా ప్రాణ సమానమైన నా ముద్దు బిడ్డను చంపేసారు. అల్లా మిమ్మల్ని క్షమించడు" అని రోదిస్తునే పిల్లాడి శవంమీద నిర్జీవంగా పడిపోయాడు.

మెల్ల మెల్లగా మంటలు ఊరు నలువైపులా వ్యాపించేయి. ఎక్కడ చూసినా రోదనలే. ఊరంతా మనుష్యులు కాలిన గబురు కంపే. తెల్లవారేసరికి ఊరే చచ్చిపోయింది. ●

**అంకితం**

"మతోన్మాదుల రాక్షసత్వానికి బలై పోతున్న నా హిందూ, ముస్లిం సోదర సోదరీమణులకు అశ్రువులతో అంకితం."

— వై. వరలక్ష్మిదేవి